సాక్షి
ఏలూరు
గురువారం । 21 । నవంబర్ । 2024



లక్ష గులాబీల అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది క్షేత్రంలో బుధవారం స్వామికి లక్ష గులాబీలతో లక్షార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



ఘనంగా క్షీరాధివాసం

తాడేపల్లిగూడెం రూరల్: కడియద్దలో పునర్నిర్మించిన గణపతి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విగ్రహాలకు క్షీరాధివాసం నిర్వహించారు.



గ్రామ పంచాయతీల పరిశీలన

పెదపాడు: జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ పెదపాడు, నాయుడుగూడెం, తోటగూడెం గ్రామ పంచాయతీలను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

రబీకి నీటి కష్టాలు?

- ఇరిగేషన్ కాల్వలు పూర్తిస్థాయిలో బాగుచేస్తామన్న ప్రభుత్వం
- ఒక్క అడుగూ ముందుకు పడని వైనం
- 11 ప్రధాన కాల్వల మరమ్మతులకు మోక్షం కలిగేనా?
- ఉమ్మడి పశ్చిమలో సుమారు రూ. 500 కోట్లతో ప్రతిపాదనలు
- ఏటా శివారు భూములకు అందని నీరు
- నేడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం



అత్తిలి మండలం గుమ్మంపాడు లాకుల వద్ద శిథిలావస్థకు చేరిన తలుపులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చివరి ఎకరాకు నీరందాలి.. పశ్చిమ డెల్టాలోని 11 ప్రధాన కాల్వలు వాటికి అనుసంధానంగా ఉండే 300 ఉపకాల్వలు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి యుద్ధప్రాతిపదిక నిర్వహిస్తాం. భారీ తుపాన్లు, గోదావరికి వరదలు వచ్చినా ఇబ్బందులు లేకుండా చూస్తాం.. ఇది ప్రతి సమీక్షా సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు వరకూ అందరూ పదే పదే చెబుతున్న మాట. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇంకా ప్రతిపాదనలు, పరిశీలన దశల్లోనే డెల్టా మరమ్మతులు ఉన్నాయి. రబీ నీటి కష్టాలు, సాగునీటి ఇబ్బందులు, డెల్టా కాల్వల మరమ్మతులు ఇలా జలవనరుల శాఖలో ఎన్నో ఇబ్బందులున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో గురువారం ఏలూరు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. రానున్న రబీ సీజన్‌కు నీటి విడుదల మరమ్మతులపై స్పష్టత ఇవ్వనున్నారు.

ఏలూరు జిల్లాకు 6 టీఎంసీలు అవసరం

ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని 29 మండలాల్లో గోదావరి పశ్చిమ డెల్టా 5,29,962 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాల వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 11 ప్రధాన కాల్వలు, 300 ఉప కాల్వల ద్వారా గోదావరి నుంచి సాగునీరు, తాగునీరు విడుదల చేస్తుంటారు. ఏటా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నీటి కేటాయింపులు, మరమ్మతులు నిర్వహించనున్న పనులపై ప్రజాప్రతినిధులకు జలవనరుల శాఖాధికారులు వివరిస్తారు. ఏలూరు జిల్లాలో 6 మండలాల్లో 82,251 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు మండలాల్లో డెల్టా విస్తీర్ణం 82,251 ఎకరాలకు 56,190 ఎకరాల్లో రబీ సీజన్‌లో వరి సాగు చేస్తారని అంచనా. ఈ క్రమంలో ఏలూరు జిల్లాకు సుమారు 6 టీఎంసీల నీటి అవసరం ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం పోలవరంలో 14 టీఎంసీలు, సీలేరు కాంప్లెక్స్‌లో 44.59 టీఎంసీలు, గోదావరికి అదనంగా ఎగువ ప్రాంతాల నుంచి 9.45 టీఎంసీల వస్తుందనే అంచనా మొత్తం కలుపుకుని 68.40 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. పశ్చిమ డెల్టాలోని ఉభయగోదావరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల్లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. దీనికి 91.350 టీఎంసీల నీరు అవసరం. సాగునీటితో పాటు తాగునీరు కూడా గోదావరి నుంచి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 22 టీఎంసీల నీటి కొరత ఉన్నట్లు అధికారులు నివేదించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు అకాల వర్షాలతో గోదావరిలో చేరే నీటితో కొంతమేర పరిస్థితి అధిగమించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిపాదనలు ముందుకు సాగేనా?

జిల్లాలో రూ.1.74 కోట్లతో 7 కాల్వల పనులు, రూ.3.70 కోట్లతో 14 డ్రెయిన్ల పనులు మంజూరయ్యాయి. అవి ఇంకా ఖరారు దశలో ఉండి ముందడుగు పడటం లేదు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లోని 6 మండలాల్లో ఈ పనులున్నాయి. రూ.5.27 కోట్లతో మరో 25 పనులు ఖరారు చేసినప్పటికీ అవి కూడా టెండర్ల దశకు చేరలేదు. ఇవి కాకుండా ఏలూరు జిల్లాలో 67 పనులను రూ.167 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపారు. అది కూడా ఖరారు కాని పరిస్థితి. సాగునీటి సలహా మండలి సమావేశంలో అభివృద్ధిపనుల పైనే కీలక చర్చ సాగనుంది. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు పర్యాయాలు వరదలు, భారీ తుపాన్లతో జిల్లాలో 29 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతుకు పెట్టుబడి ఎక్కువై ఇబ్బంది పడ్డాడు. ఈ సారి రబీలో మంచి దిగుబడిపై అనేక ఆశలు పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అనేక ప్రతికూల పరిస్థితుల నడుమ సాగు కొనసాగుతుంది. రబీ సీజన్‌లో పూర్తిగా కాల్వలపైనే ఆధారపడి సాగు నిర్వహించాల్సిన క్రమంలో నీటి ఇబ్బందులపైనే సాగు నీటి సలహామండలి సమావేశంలో చర్చ సాగుతుంది. వంతుల వారీ విధానం ద్వారా శివారు భూములకు నీరందని పరిస్థితి. వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 1 వరకు సాగునీటి కాల్వల్లో నీటిని నిలిపివేస్తామని ప్రకటించారు. ఈ సమయంలోనే మరమ్మతులు, పూడికతీత నిర్వహించాల్సి ఉంది.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఏలూరు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ద్రోణంరాజు కోదండ రామమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారోత్సవాలలో వివిధ అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు గరికిపాటి ఆర్ట్స్ థియేటర్స్ డైరెక్టర్ గరికపాటి కాళిదాసు, మైలవరపు గురుశర్మ, ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ నిర్వాహకులు రాజయోగిని బీకే లావణ్య బృందం, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీవీ రమణ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వయోజనవిద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.విజయ్ కుమార్, శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షుడు శ్రీహరి కోటి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జగన్‌ను కలిసిన జెట్టి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జెట్టి గురునాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా జగన్ మోహన్‌రెడ్డి జెట్టిని అభినందిస్తూ, పార్టీ కార్యక్రమాలను చైతన్య పరుస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూనే, కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలవాలని జెట్టికి సూచించారు. గురునాథరావు వెంట ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంభం విజయరాజు, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు ఉన్నారు.


విద్యతోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

ఏలూరు(మెట్రో): బాలకార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించేందుకు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై గోడ పత్రికను టాస్క్‌ఫోర్స్ కమిటీతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర పర్యవేక్షణతో జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా నిలపాలని టాస్క్‌ఫోర్సు అధికారులకు సూచించారు. బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఉప కార్మిక కమిషనరు పి. శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెల 21 నుంచి ఈ నెల 20 వరకు బాల, కౌమార కార్మికులను గుర్తించి, పునరావాసం కల్పించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించామన్నారు.

ఈపీఎఫ్ బకాయిల వసూలుకు ప్రత్యేక చర్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ఓ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో నవంబర్ 2024 నుంచి జనవరి 2025 వరకు ప్రత్యేక వసూళ్లు ప్రారంభించినట్టు రికవరీ అధికారి లోకనాథ్ సాహూ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్య ద్వారా తమ పరిధిలోని సంస్థల నుంచి ఈపీఎఫ్ బకాయిలను వేగంగా వసూలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈపీఎఫ్ నిధుల సకాలిక జమ, కార్మికుల హక్కుల రక్షణ, ఈపీఎఫ్ నిధి ఆర్థిక స్థితిని కాపాడేందుకు ముందస్తు చర్యలన్నారు. అన్ని సంస్థలు బకాయి నిధులను త్వరగా చెల్లించి, చట్టపరమైన చర్యలను నివారించాలన్నారు. వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇతర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఈపీఎస్ఓ సభ్యుల సంక్షేమం కోసం కట్టుబడి ఉంటామని చెప్పారు.

కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



భీమవరం కెనరా బ్యాంక్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

భీమవరం : కెనరా బ్యాంక్ 119 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం భీమవరం కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బీఎస్ అనంత పద్మారావు మాట్లాడుతూ బ్యాంక్‌ను అభివృద్ధి చేయడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా భీమవరం, రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరాల నిర్వహణతోపాటు తణుకులోని వృద్ధాశ్రమానికి రూ.50 వేలు విలువైన సామగ్రి అందించామని తెలిపారు. పలువురు ఖాతాదారులను సత్కరించారు.

దాడి కేసులో రిమాండ్

చాట్రాయి: పోతనపల్లికి చెందిన కాణంగుల చందూపై దాడి చేసిన వారిని అరెస్టు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న రాత్రి పోలవరం వే బ్రిడ్జి నుంచి మంకొల్లు వెళ్తున్న చంద్రశేఖర్‌ని అడ్డగించి స్టీల్ రాడ్లతో గాయపరిచిన కేసులో మధుసూదనరావు, యలమందల మురళీ, దుర్గ, మరో ముగ్గుర్ని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

అపస్మారక స్థితిలో భార్య



నవరం లక్ష్మణరావు (ఫైల్)



చికిత్స పొందుతున్న రమాదేవి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి ఆర్చి బైపాస్ రోడ్డుపై లారీ ఢీకొని భర్త అక్కడికక్కడే మృతిచెందగా, భార్య అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. కార్తీక మాసం సందర్భంగా స్థానిక గోకుల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనడానికి జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నవరం లక్ష్మణరావు (58) తన భార్య రమాదేవితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తూ సుబ్బంపేట రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి కాకినాడ వెళుతున్న లారీ అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మణరావు తల, కాళ్లు నుజ్జయ్యి అక్కడికక్కడే మృతిచెందాడు. అతని భార్య రమాదేవి తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను పోలీసులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. ప్రస్తుతం ఆమె అపస్మారక స్థితిలో ఉందని బంధువులు తెలిపారు. ఎస్సై షేక్ జబీర్ ఘటనా స్థలిలోని మృతదేహాన్ని సిబ్బందితో కలిసి వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఆసుపత్రికి చేరి రోదించిన తీరు కలచివేసింది. లక్ష్మణరావు జంగారెడ్డిగూడెంలోని పేరంపేట రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లావణ్యకు వివాహం కాగా, కుమారుడు నవీన్ కుమార్ ఉన్నతచదువులు నిమిత్తం అమెరికా వెళ్లారు. కుమార్తె ఆళ్ల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

ఏలూరు (టూటౌన్): అక్రమంగా తొలగించిన వీవోఏలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వెలుగు వీఓఏ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, వీఓఏ లకు గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. ధర్నాలో యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిణి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను రాజకీయ వేధింపులకు గురి చేస్తూ, అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కే విజయలక్ష్మి పాల్గొని మద్దతు ప్రకటించారు.

అక్రమ మట్టి తవ్వకాలకు బ్రేక్

జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన జేసీబీ

ద్వారకాతిరుమల: మండలంలోని లైన్ గోపాలపురం (నారాయణపురం) పోలవరం కుడి కాలువ గట్టుపై అక్రమ మట్టి తవ్వకాలను బుధవారం పోలవరం కాలువ అధికారులు అడ్డుకున్నారు. ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు తెలుగు తమ్ముళ్లు అడ్డూ అదుపు లేకుండా ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురం, పంగిడిగూడెం, గుళ్లపాడు ప్రాంతాల్లోని పోలవరం కుడి కాలువగ గట్టును కొల్లగొట్టి, గ్రావెల్ మట్టిని అమ్ముకుని లక్షలాది రూపాయలను దిగమింగుతున్నారు. ఇటీవల ‘సాక్షి’ పత్రికలో ఈ అక్రమ తవ్వకాలపై వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఎం.నాగులపల్లి ప్రాంతంలో వీటికి బ్రేక్ పడింది. నారాయణపురం, గుళ్లపాడు, పంగిడిగూడెంలో మాత్రం ఈ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున లైన్ గోపాలపురం కాలువ గట్టుపై అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న పోలవరం కుడి కాలువ భీమడోలు సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ చలపాటి బాబూజీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఘటనా స్థలంలో 30 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ మట్టి తవ్వకాలు జరిగినట్టు ఏఈ నిర్ధారించారు. జేసీబీ ద్వారకాతిరుమల మండలం నారాయణపురానికి చెందిన అల్లపల్లి వీరాచార్యులకు చెందినదిగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

తమ్ముళ్ల కుమ్ములాట.. పోలవరం కుడి కాలువ గట్టు తవ్వకాల విషయంలో కొందరు తెలుగు తమ్ముళ్లు కుమ్ములాడుకుంటున్నారు. ఎవరి గ్రామ పరిధిలోని గట్టును వారే తవ్వుకోవాలని, తమ పరిధిలోకి రావడం ఏమిటని కొందరు తెలుగు తమ్ముళ్లు పచ్చ నేతల వద్ద ఇప్పటికే పలుమార్లు పంచాయతీలు పెట్టినట్టు తెలిసింది. తవ్వకాలు జరిపితే నేనే జరపాలి అంటూ.. కాలువ గట్టుపై ఎవరు తవ్వకాలు జరిపినా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడట.

జీజీహెచ్‌లో నిధుల గోల్‌మాల్

- రూ.2.50 కోట్ల నిధుల స్వాహా ?
- ఇష్టారాజ్యంగా పరికరాలు కొనుగోళ్లు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని వైనం
- పూర్వ అధికారి, మరో వైద్యాధికారి కీలకపాత్ర



జీజీహెచ్‌లో పనిచేసే వైద్య పరికరాలను నిరుపయోగంగా పక్కన పడేసిన వైనం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రికి అవినీతి రోగం పట్టింది. వైద్యాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు అనంతరం జిల్లా ఆసుపత్రి కాస్తా.. బోధనాసుపత్రిగా మారింది. అయితే జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు, మెరుగైన సౌకర్యాల కల్పనపై పెట్టుకున్న కొండంత ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. ఒకవైపు పేదలకు సరైన వైద్యం అందని దుస్థితి. మరోవైపు సర్కారు మంజూరు చేసిన నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు. గత ప్రభుత్వ హయాంలో సర్వజన ఆసుపత్రిలో సౌకర్యాల కల్పన, వైద్య పరికరాల కొనుగోళ్లకు సంబంధించి మంజూరు చేసిన రూ.2.50 కోట్ల నిధులు గోల్‌మాల్ అయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికే జీజీహెచ్‌లోని మెడికల్ కళాశాలకు చెందిన మార్చురీలో అనాథ శవాలను భారీ రేటుకు అమ్ముకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దానిపై మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు, జీజీహెచ్ ఉన్నతాధికారులు సరైన రీతిలో స్పందించలేదనే అభిప్రాయం ఉంది. తాజాగా జీజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ హయాంలో భారీగా నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వస్తున్నాయి. నిధుల వినియోగంలో నాలుగు నెలల క్రితం పదవీవిరమణ చేసిన హాస్పిటల్ పర్యవేక్షణాధికారితో పాటు మరికొందరి పాత్ర ఉందని అంటున్నారు. ఏకంగా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కాజేశారని చెబుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

ఏలూరు నగరానికి చెందిన సాధారణ కంపెనీకి వైద్య పరికరాల కొనుగోలు కాంట్రాక్ట్ అప్పగించటం వెనుక రహస్యం ఏంటనే చర్చ సాగుతోంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల విక్రయాలు చేసే కంపెనీకి ఆధునిక వైద్య పరికరాల కాంట్రాక్ట్ ఏ విధంగా ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎంతో కాలం సేవలందించాల్సిన వైద్య పరికరాల కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలను పక్కనబెట్టి నాసిరకం కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన రెండు నెలలకే అవి మొరాయించడం వాటి నాణ్యతను తేటతెల్లం చేస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ వైద్య పరికరాల విషయంలోనూ కేవలం అవినీతి వాటాకే పెద్దపీట వేయటంపై సర్వత్రా అగ్రహం వ్యక్తం అవుతుంది.

ప్రస్తుత వైద్యాధికారిది కీలకపాత్ర

సర్వజన ఆసుపత్రిలో ప్రస్తుతం పనిచేస్తున్న ఒక వైద్య అధికారి ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు హాస్పిటల్‌లో జోరుగా చర్చ సాగుతోంది. పదవీ విరమణ చేసి వెళ్ళిన పర్యవేక్షణ అధికారితో కలిసి ఆయన చేసిన అవినీతికి అంతేలేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో పనిచేసిన పర్యవేక్షణాధికారి అడుగడుగునా అక్రమాలకు పాల్పడుతూ ఉండగా ఆయన కీలకంగా వ్యవహరించారని అంటున్నారు. రూ.2.50 కోట్ల నిధులతో అభివృద్ధి ఏం చేశారో భగవంతుడికే ఎరుక అంటున్నారు. వీటితోపాటు బోధనాసుపత్రిగా వర్గోన్నతి చెందిన అనంతరం సుమారుగా రూ.20 కోట్లు నిధులు వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం మంజూరయ్యాయి. అవన్నీ సక్రమంగా వినియోగించారా? లేదా అనేది పూర్తిగా విచారణ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రూ.2.50 కోట్ల నిధులు మాయం ?

ఏలూరు సర్వజన ఆసుపత్రి అభివృద్ధితోపాటు, హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల రూమ్స్, అత్యవసర విభాగాలు, సిబ్బంది గదులకు ఏసీలు ఏర్పాటు, పాడైన వైద్య పరికరాలు కొనుగోళ్లకు రూ.2.50 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. పూర్వ హాస్పిటల్ పర్యవేక్షణాధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తూ నిధులను సక్రమంగా వినియోగించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏకంగా 60కి పైగా ఏసీలు కొనుగోలు చేసినట్లు చెబుతున్నా.. హాస్పిటల్‌లో ఎక్కడా కనిపించని వైనం. అత్యవసర విభాగాల్లో సైతం రోగులకు ఏసీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మల్టీ పారా వైద్య పరికరాలు, ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్, రేడియాలజీ విభాగానికి సంబంధించిన వైద్య పరికరాలు, ఈసీజీ మిషన్లు, ఇతర వైద్య పరికరాలు భారీ ఎత్తున కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపుతూ నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.



ఏలూరు సర్వజన ఆసుపత్రి (ఫైల్)

అంతరాన్ని తగ్గించేందుకు కృషి



పైలా దేశిక్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్

నూజివీడు: ఆర్జీయూకేటీకి పరిశ్రమలకు మధ్య అంతరాన్ని తగ్గించడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యం, నాణ్యతా ప్రమాణాలను పెంపొందించేందుకు పరస్పర సహకారం అందించుకోనున్నట్టు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) శాస్త్రవేత్త, డిప్యూటీ డైరెక్టర్ పైలా దేశిక్ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఐఎస్ఓ ప్రకారం ప్రయోగశాలల నాణ్యత, వాటి నిర్వహణ, ఖచ్చితతత్వం, విశ్వసనీయత ప్రాముఖ్యతను వివరించారు. బిస్ గుర్తింపు, దాని ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పైలా దేశిక్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో సీఏఓ బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీఎల్‌టీసీ సహాయ సంచాలకుడు ఎస్.ఉగాది రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఆపైన ఉత్తీర్ణులైన 15 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30 చివరి తేదీ అని, ఇతర వివరాలకు 9493482414 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.